ఇక హాయిగా.. వేగంగా..

- చివరి దశకు చేరిన హైవే విస్తరణ పనులు
- గోకవరం నుంచి బూరుగుపూడి గేటు వరకు రహదారి విస్తరణ
- 99 శాతం పనులు పూర్తి
- ఆనందం వ్యక్తం చేస్తున్న వాహనదారులు



గోకవరంలో పది మీటర్ల మేర విస్తరించిన జాతీయ రహదారి



గోకవరం శివారున జరుగుతున్న వంతెన నిర్మాణ పనులు

గోకవరం: గోకవరం నుంచి బూరుగుపూడి గేటు వరకూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నిర్మిస్తున్న రహదారి విస్తరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకూ ఉన్న 516–ఇ జాతీయ రహదారి పరిధిలోని గోకవరం శివారు నుంచి కోరుకొండ మండలంలోని బూరుగుపూడి గేటు వరకు సుమారు 11.2 కిలో మీటర్ల మేర రహదారి విస్తరణకు గతేడాది జనవరిలో రూ.65 కోట్లు నిధులు మంజూరయ్యాయి. గతంలో ఉన్న ఉన్న రహదారిని పది మీటర్ల వరకు వెడల్పు చేసేందుకు గతేడాది ఫిబ్రవరి నెలలో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పనులు 99 శాతం పూర్తయ్యాయి. దీంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఇక్కట్లు

గోకవరం నుంచి కోరుకొండ వరకూ గతంలో 5.5 మీటర్లు వెడల్పు గల రోడ్డు ఉండేది. రాజమహేంద్రవరం నుంచి భద్రాచలం, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్‌కు నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగించేవి. రహదారి ఇరుకుగా ఉండటంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనికి తోడు పలు చోట్ల రహదారి పూర్తిగా ఛిద్రం కావడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ క్రమంలో గతేడాది రూ.65 కోట్లు నిధులతో రహదారి విస్తరణ పనులు చేపట్టారు. ప్రస్తుతం పనులు దాదాపు పూర్తయ్యాయి. గోకవరం శివారున దేవీపట్నం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సమీపంలో ఇరుకుగా ఉన్న వంతెన స్థానంలో నూతనంగా వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రూ.60 లక్షలతో ఈ పనులు వేగంగా జరుగుతున్నాయి. అతి త్వరలో ఈ పనులు కూడా పూర్తికానున్నాయి.



రహదారి చెంత ప్రయాణికుల కోసం నిర్మించిన షెడ్డు

షెడ్ల నిర్మాణం

ఈ మార్గంలో ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా షెడ్లు సైతం నిర్మించారు. ప్రమాదకరమైన మలుపులు, కాలువల వద్ద రెయిలింగ్ ఏర్పాటు చేశారు. గతంలో ఈ మార్గంలో రాకపోకలకు పలు ఇబ్బందులు పడేవారమని, రహదారి విస్తరణతో ప్రయాణం సురక్షితంగా, సుఖవంతంగా మారిందని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

> **పనులు దాదాపు పూర్తి**
>
> గోకవరం నుంచి బూరుగుపూడి గేటు వరకూ నిర్మిస్తున్న రహదారి విస్తరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఈ మార్గంలో పలు చోట్ల ప్రైవేటు స్థలాన్ని కొనుగోలు చేశాం. అక్కడక్కడా రోడ్డు సేఫ్టీ పనులు చేయాల్సి ఉంది. గోకవరం శివారున వంతెన వెడల్పునకు అనుమతి రావడంతో ప్రస్తుతం ఆ పనులు వేగంగా నిర్వహిస్తున్నాం.
>
> – శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ జేఈ, రాజమహేంద్రవరం

ఘనంగా తీర్థ మహోత్సవం

రంగంపేట: ఈలకొలనులో కొలువైన ముత్యాలమ్మ తల్లి వార్షిక తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి స్వరూపాలైన గరగలను గ్రామంలో ఇంటింటికీ ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు చలివిడి, వడపప్పు, నైవేద్యం అమ్మవారికి సమర్పించారు. జెడ్పీకో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, గ్రామ సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ ఎరుబండి సూరిబాబుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

కుటుంబ ఆరోగ్య సర్వే

బిక్కవోలు: మండలంలోని రంగాపురం గ్రామంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సంస్థ ఆధ్వర్యంలో కుటుంబ ఆరోగ్య సర్వేను మంగళవారం నిర్వహించారు. గ్రామంలో సర్వే పూర్తి చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని సర్వే టీం సభ్యుడు జగదీష్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గండికోట వీరభద్రరావు, పంచాయతీ కార్యదర్శి పావని, ఏఎన్‌ఎం లత, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

ఆభరణాల చోరీ

గోకవరం: కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో వృద్ధురాలు ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. కాలనీలోని కాసే వెంకటలక్ష్మి అనే 75 ఏళ్ల మహిళ మధ్యాహ్నం ఇంట్లో నిద్రిస్తుండగా సుమారు గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమె మెడలో ఉన్న రెండున్నర కాసుల గొలుసు, చెవికి ఉన్న దుద్దులు చోరీ చేశాడు. బాధితురాలి ఫిర్యాదుపై ఎస్సై శివ నాగబాబు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

నేడు జగ్జీవన్‌రామ్ జయంతి

మధురపూడి: ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని బుధవారం వాడవాడలా ఘనంగా నిర్వహించాలని మాదిగ ఐక్యవేదిక గౌరవాధ్యక్షుడు ఇండిగమెల్లి సత్యనారాయణ, కన్వీనర్ మద్దాల చంటిబాబు అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. దేశ స్వాతంత్ర్యం, సమాజంలో సమానత్వానికి పోరాడిన మహనీయుడన్నారు.

నేటి నుంచి బాపనమ్మ జాతర

అనపర్తి: గ్రామ దేవత బాపనమ్మ జాతర, తీర్థ మహోత్సవలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యుడు తేతలి రామకృష్ణారెడ్డి తెలిపారు. 5వ తేదీ అమ్మవారి జాతర, 6, 7వ తేదీల్లో రెండు రోజుల పాటు తీర్థం జరుగుతాయని ఆయన తెలిపారు. జాతరలో భాగంగా గరగ నృత్యాలు, బ్యాండ్ మేళాలు, కోయ మేళాలు, గొర్ర గేదెలు, ఎలుగుబంట్లు, శక్తి వేషాలు, బుట్ట బొమ్మలు తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని, ఆలయ ప్రాంగణాన్ని, ప్రధాన రహదారిని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

వైద్య సేవలు వినియోగించుకోవాలి

పెదపూడి: ప్రభుత్వ ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెదపూడి సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పి.సుజాత అన్నారు. పెదపూడిలో సామాజిక ఆరోగ్యకేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ ఆస్పత్రిలో 8 మంది వైద్య నిపుణులు సేవలందిస్తున్నారని చెప్పారు. ఆస్పత్రి అభివృద్ధికి దాతల సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కోరా బాబి, కాకర సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

రంగంపేట: మండలం ముకుందవరానికి చెందిన మరుకుర్తి చంద్రరావుపై సామర్లకోటకు చెందిన మరుకుర్తి సాయి సోమవారం మధ్యాహ్నం ఇంట్లోకి చొరబడి కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో చంద్రరావు ఎడమ చేతికి బలమైన గాయమవ్వడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడు సాయి పరారీలో ఉన్నాడని ఎస్‌ఐ టి.రామకృష్ణ మంగళవారం రాత్రి తెలిపారు.

ఐఎస్‌టీఎస్‌కి 'బెస్ట్' కాలేజ్ అవార్డు



కేంద్రమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఉపేంద్రరెడ్డి

రాజానగరం: తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళ ఇంజినీరింగ్ కళాశాలకు ఆసియా ఎడ్యుకేషన్ సమ్మిట్ 2023 నుంచి 'బెస్ట్ ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజ్' అవార్డు లభించిందని ఆ కళాశాల చైర్మన్ పి.ఉపేంద్రరెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ అవార్డును విదేశాంగశాఖ సహాయ మంత్రి డాక్టర్ రాజుకుమార్ రంజన్ నుంచి న్యూఢిల్లీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో తాను అందుకున్నానన్నారు. అలాగే తమ కళాశాల 2022లో నాక్ ప్లస్ గుర్తింపు పొందినందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి నుంచి ప్రశంసలు, సత్కారం లభించాయన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోకవరం: పురుగుమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు గోకవరం పోలీసులు తెలిపారు. గోకవరానికి చెందిన నాగుల శేఖర్‌బాబు(42) సోమవారం మధ్యాహ్నం పురుగుమందు తాగాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతడిని కుటుంబ సభ్యులు గోకవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేసినప్పటికీ పరిస్థితి విషమంగా మారింది. తర్వాత రాజమండ్రి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం చికిత్స పొందుతూ మరణించినట్టు ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గోకవరం ఎస్సై శివనాగబాబు తెలిపారు.

పేదలకు బియ్యం పంపిణీ

సీతానగరం: తల్లిదండ్రులైన దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావు, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆశీస్సులతోనే తాము ఉన్నతస్థితిలో ఉన్నామని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మంగళవారం ఇనుగంటివారిపేటలో సర్పంచ్ సత్యం రాంపడు ఆధ్వర్యంలో ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా.. 1500 మంది పేదలకు రూ 5.25 లక్షలు విలువైన బియ్యం పంపిణీ చేశారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ–2 సత్యం మదన్‌బాబు, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, రాష్ట్ర దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి డాక్టర్ బాబు, పిచ్చుకుల రవికుమార్, చల్లమళ్ల సుజీరాజు పాల్గొన్నారు. సింగవరానికి చెందిన పార్టీ నాయకుడు అంబటి రమణ ఆధ్వర్యంలో గ్రామాల్లోని ఎస్సీపేటలకు కేకలు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

జగన్ పాలనలో మహిళాభ్యున్నతి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- నియోజకవర్గంలో 5,285 డ్వాక్రా సంఘాలకు రూ.13,590 కోట్ల ఆసరా లబ్ధి



జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే మహిళాభ్యున్నతి సాధ్యమని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండలోని రాజబాబు జూనియర్ కాలేజీలో డీఆర్‌డీఏ పీడీ సుభాషిణీ అధ్యక్షతన మంగళవారం మూడో విడత ఆసరా కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ మహిళలను మహారాణులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజారంజక పాలన కొనసాగాలంటే మళ్లీ జగన్‌ను గెలిపించుకోవాలన్నారు. 2019కు ముందు చంద్రబాబు మహిళలను మోసగించారని, డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు మొండి చేయి చూపించారన్నారు. తొలుత సభా ప్రాంగణంలో అంబేడ్కర్, జ్యోతీరావు పూలే, వైఎస్ రాజశేఖర రెడ్డి, జక్కంపూడి రామ్మోహనరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, రాజానగరం నియోజకవర్గం మహిళా నేత కొల్లం రాజా రమాదేవి, డీఆర్‌డీఏ కోఆర్డినేటర్ జనార్దనరావు, ఏపీఎం జయంతి రావు పాల్గొన్నారు.

వైద్య రంగానికి పెద్దపీట

బిక్కవోలు: ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఆర్ ఎస్‌పేట పంచాయతీ కార్యాలయం వద్ద మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ) సర్వీసును ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే భవన నిర్మాణాలు చివరి దశకు చేరుకున్నాయన్నారు. గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం విజయవంతంగా అమలవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ సంఘం చైర్‌పర్సన్ పద్మావతి, ఏపీ రాష్ట్ర పౌల్ట్రీ అసోసియేషన్ అధ్యక్షుడు కర్రి ముకుందరెడ్డి, సర్పంచ్ యామన దుర్గాభవాని, కొమరిపాలెం ఉపసర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

నేడు వైద్యశిబిరం

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో బుధవారం జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఉదయం 9.30 గంటలకు ఈ శిబిరం ప్రారంభమవుతుందన్నారు. జీఎస్‌ఎల్ వైద్యులు సేవలందిస్తారన్నారు. అలాగే సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో బుధవారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేతుల మీదుగా మూడో విడత ఆసరా కార్యక్రమం జరుగుతుంది.

సీతారాములకు పుష్పయాగం

రంగంపేట: సీతారాముల కల్యాణోత్సవాల్లో భాగంగా రంగంపేట కోదండ రామాలయంలో సీతారాములకు పుష్పయాగం మంగళవారం చేశారు. ఉత్సవ మూర్తులను ఊయలలో వేసి పూజలు, భజనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ముకుందవరంలోని కోదండ రామాలయం వద్ద బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాన్నదానం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఇది మహిళా పక్షపాత ప్రభుత్వం



చింతపల్లిలో మహిళలకు ఆసరా లబ్ధి చెక్కు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి

పెదపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో మహిళా పక్షపాత ప్రభుత్వం నడుస్తుందని జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాలయ వెంకటలక్ష్మి అన్నారు. చింతపల్లి, వేండ్ర గ్రామాల్లో వైఎస్సార్ ఆసరా మూడో విడత లబ్ధి చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళా అభ్యున్నతి కోసం గతంలో ఎన్నడూ లేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కొల్లు లోవకుమారి, కోసూరి శ్రీనివాసు, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు కొల్లు పెద్దాకాపు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కొల్లు సత్తిబాబు, సాంబత్తుల చంటి, ఏపీఎం చినబాబు, కర్రి శ్రీవెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నను సీఎంగా గెలిపించుకోవాలి



బిక్కవోలులో ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, మళ్లీ జగనన్నను సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరముందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం బిక్కవోలు గ్రామంలో మూడో విడత ఆసరా పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాడు చంద్రబాబునాయుడు పొదుపు మహిళలను నట్టేట ముంచాడన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో వచ్చాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా సంఘాల రుణాలన్నీ మాఫీ చేస్తున్నారన్నారు.

కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి, జిల్లా మహిళా సంక్షేమ సంఘం చైర్మన్ రొంగల పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఊలపల్లిలో క్షీరాభిషేకం

మండలంలోని ఊలపల్లి గ్రామంలోని ఆసరా మూడో విడత చెక్కు పంపిణీ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేసి తమ అభిమానం చాటుకున్నారు.

అక్కాచెల్లెమ్మలకు ముఖ్యమంత్రి బాసట



దొడ్డిగుంటలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

రంగంపేట: అక్కాచెల్లెమ్మలకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాసటగా నిలుస్తున్నారని అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. మంగళవారం దొడ్డిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వైఎస్సార్ ఆసరా మూడో విడత రుణమాఫీ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగడానికి ముఖ్యమంత్రి జగనన్న ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అనంతరం ఆసరా నమూనా చెక్కును డ్వాక్రా మహిళలకు అందించారు. ఈ సందర్భంగా డ్వాక్రా సంఘాల సభ్యులు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ కారి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

గృహసారథులు ప్రజలకు, ప్రభుత్వానికి వారధులు

రంగంపేట: గృహసారథులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా వ్యవహరించాలని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జి.దొంతమూరులో జరిగిన గృహసారథుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గృహసారథులందరూ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలతో మాట్లాడి గత ప్రభుత్వ పాలనకు, వైఎస్సార్ సీపీ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని వివరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీకో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి రవిశంకర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, సర్పంచ్ గోలి రమణ, ఎంపీటీసీ గోలి వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెల్లయ్య చెరువులో అక్రమ నిర్మాణాలు



చెల్లయ్య చెరువులో జరుగుతున్న నిర్మాణాలు

రాజానగరం: నియోజవర్గ కేంద్రమైన రాజానగరంలో చెరువుల ఆక్రమణలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఆయా చెరువులకు సంబంధించిన పిషర్‌మెన్ సొసైటీ సభ్యులు ఆక్రమణలను అడ్డుకునే ప్రయత్నం చేసినా ప్రయోజనం ఉండటం లేదు. వెంకటాపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 363లో 5.04 ఎకరాలలో ఉన్న చెల్లయ్య చెరువు ఈ విధంగా ఆక్రమణల బారిన పడింది. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతుంటే అధికారం యంత్రాంగం ఫిర్యాదులొస్తేనేగాని చర్యలకు ఉపక్రమించడం లేదు. దీనితో సంబంధిత పిషర్‌మెన్ సొసైటీ సభ్యులు ఆక్రమణలకు గురవుతున్న పైచెరువు గురించి, అందులో జరుగుతున్న నిర్మాణాల గురించి స్థానిక తహసీల్దారుకు, పంచాయతీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేయడంలో ఎట్టకేలకు స్పందించారు. చెల్లయ్య చెరువు విస్తీర్ణంపై సర్వే చేసి, ఆక్రమణలపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కన్నా ఆశ్రయ ఫౌండేషన్‌లో భోజనం వితరణ



కన్నా ఆశ్రయ్ ఫౌండేషన్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జోనల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సుదర్శన ఆయుష హోమం జరిపారు. రాజమహేంద్రవరం విమానాశ్రయం సమీపంలోని కన్నా ఆశ్రయ్ ఫౌండేషన్‌లో మానసిక విద్యార్థులకు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ సహకారం, సహాయానికి చిరునామాగా గణేష్ నిలిచాడన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఏఎంసీ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి, ఉల్లి గణ, కంటే వినయ్ తేజ, చిక్కిరెడ్డి దుర్గాభాస్కర్ పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో ప్రజాసమస్యల పరిష్కారం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- గాదరాడలో గడపగడపకూ మన ప్రభుత్వం



గాదరాడలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: ప్రజా సమస్యల పరిష్కారానికి సీఎం జగన్ ప్రభుత్వ చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో సింగిల్‌గా పోటీచేసి, అభ్యర్థులను పోటీకి నిలిపే సత్తా ప్రతిపక్షాలకు ఉందా అని ప్రశ్నించారు. కోరుకొండ మండలం గాదరాడలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పోలేరమ్మ ఆలయం సమీపం నుంచి గ్రామ శివారు వరకూ ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన 50 గడపలు తిరిగి ప్రజా సమస్యలు, వారికి అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. చంద్రబాబు తన గారడీ మాటలతో ప్రజలను మోసగించడానికి కుయుక్తులు పన్నుతున్నారన్నారు. కార్యక్రమంలో హరిబోలు చినబాబు, పాలెం నాగవిష్ణు, తోరాటి శ్రీను, చిక్కిరెడ్డి భాస్కర్, శివ, శ్రీను, గొల్లవిల్లి అశోక్, దోనపాటి చిన్నఏసు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాల పెంపునకు పథకాల దోహదం



గడప గడపకూ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తిలో గడపగడపకూ మన ప్రభుత్వం

అనపర్తి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు దోహదపడుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం, అనపర్తి–కొప్పవరం రోడ్ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలు తెలుసుకుంటూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన ప్రయోజనాన్ని వివరిస్తూ ముందుకు సాగారు. వలంటీర్ల పనితీరు, లబ్ధిదారుల ఎంపికలో ఏమైనా పొరబాట్లు జరుగుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

సంక్షేమ ఫలాలు పారదర్శకంగా పార్టీలకతీతంగా అర్హులందరికీ అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. లబ్ధిదారుల తలుపు తట్టి సంక్షేమ పథకాలు అందిస్తుండడంతో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 98 శాతం హామీలను ప్రభుత్వం ఇప్పటికే నెరవేర్చిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఇంటింటికీ రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకూ లబ్ధి చేకూరిందన్నారు. గ్రామాల సంపూర్ణ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కొండేటి భీమేష్, కర్రి చినవెంకటరెడ్డి, పార్టీ జిల్లా వాణిజ్యవిభాగం అధ్యక్షుడు ఎస్ఎస్, ఏఎంసీ డైరెక్టర్ కోనాల సత్యనారాయణరెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, పారిశ్రామికవేత్త తేతలి నారాయణరెడ్డి, పార్టీ నాయకులు మండ శ్రీనివాసరెడ్డి, పడాల కల్యాణ్ రెడ్డి, ద్వారంపూడి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

